# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-05-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో 15 నగరాల్లో లేబర్ అడ్డాల నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **విద్యుత్ ఉప కేంద్రాల వద్ద సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించిన తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి.**

3. **మత్స్య సాగరమాల ప్రాజెక్ట్‌తో మత్స్యకారుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్న కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు**

4. **పదవ తరగతి పరీక్షల్లో ఈ ఏడాది ఉత్తీర్ణత పెరగడం కూటమి ప్రభుత్వం విద్యాశాఖలో తీసుకువస్తున్న సంస్కరణలకు నిదర్శనమని వెల్లడించిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్.**

5. **ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా, వినుకొండ పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్.**

==========================

రాష్ట్రంలో 15 నగరాల్లో లేబర్ అడ్డాల నిర్మాణం చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మేడే సందర్భంగా కృష్ణా జిల్లా, వీరంకి లాకు గ్రామంలో భవన నిర్మాణ కార్మికులను కలిసి, వారి కష్టాలు తెలుసుకున్నట్లు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. వారి సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అన్న క్యాంటీన్లు, ఆటో డ్రైవర్ సేవలో, మత్స్యకారుల సేవలో వంటి అనేక పథకాలు వారికి అందిస్తున్నామని తెలిపారు. వివిధ రంగాల్లో కార్మికులకు ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు కల్పించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. శ్రామికుల ఆరోగ్యంపై శ్రద్ధ పెడుతూ రాష్ట్రంలోని 6 చోట్ల ఈఎస్ఐ ఆస్పత్రులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రతీ నెలా పేదల సేవలో కార్యక్రమంలో లబ్దిదారులకు పింఛన్ అందిస్తున్నట్లు చెప్పారు.

--------------------------

విద్యుత్ ఉప కేంద్రాల వద్ద ఖాళీ స్థలాలు ఉంటే పైలట్ ప్రాజెక్టు కింద సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ సంస్థలను తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. విద్యుత్‌శాఖ అధికారులతో

హైదరాబాదులోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ మినహా ఉమ్మడి తొమ్మిది జిల్లాల్లో రెండు చొప్పున 18 సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణానికి నోడల్ అధికారులను వెంటనే నియమించాలని సూచించారు. డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్ సరఫరాకు అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

---------------------------

పదవ తరగతి పరీక్షల్లో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఉత్తీర్ణత పెరగడం కూటమి ప్రభుత్వం విద్యాశాఖలో తీసుకువస్తున్న సంస్కరణలకు నిదర్శనమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ అమలు చేస్తున్న ప్రణాళికలు ప్రశంసనీయమని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. మెగా పేరెంట్ టీచర్స్ మీట్, పరీక్షలకు ముందు తీసుకువచ్చిన వంద రోజుల ప్రణాళిక వంటివి అద్భుత ఫలితాలకు దోహదపడ్డాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో గత ఏడాది 72.8 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది అది 78.39 శాతానికి పెరిగిందన్నారు.

---------------------------

మత్స్య సాగరమాల ప్రాజెక్ట్ తో మత్స్యకారుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లా ఎర్రముక్కాం గ్రామంలో కోల్ ఇండియా, కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు సుమారు 5 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ దీపాలను ఆయన నిన్న ప్రారంభించారు. జిల్లాలోని వంద మత్స్యకార గ్రామాల్లో తొలి విడతగా వెయ్యి 400 సోలార్ లైట్లు ఏర్పాటు చేసినట్లు, రెండో విడతలో మరిన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మత్స్యకార గ్రామాలకు రహదారి సౌకర్యాలు మెరుగుపరుస్తూ, పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతో ఉత్తరాంధ్రలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా, వినుకొండ పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, స్థానిక శాసన సభ్యులు జి.వి ఆంజనేయులతో కలిసి నిన్న శంఖుస్థాపనలు చేశారు. పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి గుడికొండ చుట్టూ కోటి 85 లక్షల రూపాలయలతో నిర్మించనున్న గిరిప్రదక్షిణ రోడ్డును, 5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణ పనులను ఈ సందర్భంగా ప్రారంభించారు. అదే విధంగా లబ్ధిదారుల ఇళ్లలో ఏర్పాటు చేసిన పిఎం సూర్యఘర్ యూనిట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

కృష్ణా జిల్లా పమిడిముక్కలలో పర్యటించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని నిన్న సందర్శించారు. పమిడిముక్కలలో ఫించన్ల పంపిణీ కార్యక్రమం ముగించుకుని మరో కార్యక్రమానికి వెళ్తున్న క్రమంలో గ్రామంలో అంగన్వాడీ కేంద్రం కనిపించడంతో ముఖ్యమంత్రి అక్కడ ఆగారు. అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా చిన్నారులు పాడిన పద్యాలను

విన్నారు. పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం గురించి అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలను అడిగి తెలుసుకున్నారు.

---------------------------

గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందించడమే జల్ జీవన్ మిషన్ లక్ష్యమని కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి కమల్ కిషోర్ సోన్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని పోలవరం జిల్లా, మామిడికోట గ్రామంలో జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన త్రాగునీటి కుళాయిలను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా కమల్ కిషోర్ సోన్ మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లోను జలజీవన్ మిషన్ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతి వ్యక్తికి రోజుకు సుమారు 55 లీటర్ల నీరు అందించేలా చర్యలు చేపట్టామన్నారు.

---------------------------

జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో సెల్ బ్రాడ్ కాస్ట్ అలర్ట్ సిస్టమ్ ను ఈరోజు పరీక్షించనున్నారు. ఈ ఉదయం 11 గంటల 15 నిముషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 15 నిముషాల వరకు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతంలోని మొబైల్ ఫోన్లకు ఈ టెస్ట్ సందేశాలు పంపించబడతాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సందేశాలు శబ్దం, వైబ్రేషన్‌తో.. నోటిఫికేషన్ రూపంలో కనిపిస్తాయని తెలిపింది. ఇది కేవలం పరీక్ష చేసేందుకు మాత్రమేనని, ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ప్రకృతి వైపరీత్యాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో వేగంగా సమాచారం చేరవేయడానికి ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని పేర్కొంది.

---------------------------

రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఎండల తీవ్రత అధికంగా ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదవుతున్నాయి. దక్షిణ ఒడిశా నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ఏర్పడిన ద్రోణి కొనసాగుతుందని అమరావతి లోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్ర అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ..

వాయిస్..27 సెకన్లు

తెలంగాణలో రానున్న మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం తెలిపింది. గరిష్ట ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని వెల్లడించింది.

=======================